

అంజన్న ఆలయం మూసివేత

కొండగట్టు: చంద్రగ్రహణం సందర్భంగా కొండగట్టు అంజన్న ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. ఆదివారం ఆలయ సంప్రోక్షణ అనంతరం తెరుస్తామని ఏఈవో తెలిపారు.



పెరికల అభివృద్ధికి కృషి

జగిత్యాల:పెరిక కులస్తుల అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో పెరుకల సమ్మేళనం నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం నుంచి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం మూసివేత



నృసింహస్వామివారి ఆలయాన్ని మూసివేస్తున్న చైర్మన్, అర్చకులు

ధర్మపురి: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలను ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు మూసివేశారు. తిరిగి ఈనెల 29న (ఆదివారం) గ్రహణం విడిచిన అనంతరం ఆలయల్లో సంప్రోక్షణ, పుణ్యవచనం, గ్రహణహోమం నిర్వహించి ఉదయం 9గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. గ్రహనం సందర్భంగా శనివారం రాత్రి కోజాగిరి పౌర్ణమిని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకులు నేరెల్ల శ్రీనివాసాచారి తదితరులున్నారు.

ఆర్టీసీ ప్రగతి చక్రం పురస్కారాలు



చెక్కు అందజేస్తున్న డిప్యూటీ రీజనల్ మేనేజర్

కోరుట్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కండక్టర్లు, డ్రైవర్లకు శనివారం డిప్యూటీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ ఆగస్టు నెలకు సంబంధించిన ప్రగతి చక్రం అవార్డులు అందించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు కష్టపడి సంస్థను లాభాల్లోకి తీసుకురావాలని కోరారు. సంస్థ బాగుంటేనే అందరం బాగుంటామన్నారు. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్లు, డ్రైవర్లకు క్యాష్ అవార్డులు అందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ మాధురి, అసిస్టెంట్ మేనేజర్ జీజీ.సింగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


మల్యాల:మండలంలోని ముత్యంపేట (దిగువ కొండగట్టు)లోని లాడ్జీల్లో పోలీసులు శనివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సై తీగల అశోక్, కుమారస్వామి, పోలీసు సిబ్బంది లాడ్జీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో లాడ్జీలను తనిఖీ చేశామని, ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు



కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో జగిత్యాలతోపాటు, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలో సిబ్బందికి శిక్షణ ఉంటుందని, మొత్తంగా 2,236 మందికి శిక్షణ ఇస్తామని కలెక్టర్ వివరించారు.



గుడ్లగూబ పగలు చూడలేదు..కాకి రాత్రిని చూడలేదు..
ఓటును అమ్ముకునే ప్రజలు ప్రగతిని, ప్రజాస్వామ్యాన్ని చూడలేరు.
- డాక్టర్ అబ్దుల్ కలామ్

ఈవీఎంలకు 41ఏళ్లు

మీకు తెలుసా?

కరీంనగర్ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లు వినియోగంలోకి వచ్చి 39ఏళ్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలకు ప్రత్యామ్నాయంగా 1982లో ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మొదట్లో వీటి వాడకానికి కేంద్ర ఎన్నికల సంఘం ససేమిరా అన్నప్పటికి అనంతర కాలంలో ఓకే చెప్పింది. మొదటిసారి 1982 మే 19న జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరోగ్ నియోజకవర్గంలో ఈవీఎంలను వినియోగించారు. అనంతరం దేశవ్యాప్తంగా 1982–83 సంవత్సరాల్లో 10 నియోజకవర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో వినియోగించారు. వీటిని వినియోగించవద్దని 1984 మే 5న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా మార్పులు చేసి 1988 డిసెంబర్‌లో సెక్షన్ 61 ద్వారా కేంద్రం ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది. ఆ తరువాత సెక్షన్ 61ఏ సవరణలను 1989 మార్చి 17న ప్రజాప్రాతినిధ్యం చట్టం అమలులోకి తెచ్చింది. దీన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో ఈవీఎంల వాడకం మళ్లీ ప్రారంభమైంది. 1990 జనవరిలో ఎన్నికల సంస్కరణల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే ఏడాది ఏప్రిల్‌లో ఈవీఎంల వాడకాన్ని సాంకేతిక నిపుణుల కమిటీ సమర్థించింది. ఈవీఎంల వాడకానికి 1998లో ప్రజా ఆమోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. లోక్‌సభకు 2004, 2014 మధ్య జరిగిన మూడు ఎన్నికల్లో వీటినే వాడారు. వీవీప్యాట్లను వాడాలని వినియోగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దశల వారీగా 2013 నుంచి వీవీ ప్యాట్లు వినియోగిస్తున్నారు.



ప్రతీ పోరు రసవత్తరం

- ఏడు మండలాల ముఖచిత్రం
- 2009లో నియోజకవర్గ కేంద్రంగా..
- పేరు మారింది..రాజకీయ తీరూ మారింది
- గతంలో నాలుగు నియోజకవర్గాల సమూహం
- విలక్షణ తీర్పు ఇస్తున్న ఓటర్లు
- నియోజకవర్గం ఆవిర్భావం నుంచి 'కొప్పుల'కే పట్టం

గొల్లపల్లి: మార్పులు.. చేర్పులు.. కూర్పులు.. నాలుగు నియోజకవర్గాలు.. ఆరు మండలాల సంపూర్ణ ముఖచిత్రం ధర్మపురి. ఒకప్పుడు మేడారం, చొప్పదండి, జగిత్యాల, బుగ్గారం నియోజకవర్గాల్లో ఉన్న గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం, ధర్మపురి మండలాల (తాజాగా ఎండపల్లి)తో 2009లో ధర్మపురి (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గమైంది. అప్పటి నుంచి ఇక్కడ అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి.



ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ఆలయం



మాతంగి నర్సయ్య (ఫైల్)



న్యాలకొండ రాం కిషన్ రావు (ఫైల్)



శికారి విశ్వనాథం (ఫైల్)



జువ్వాడి రత్నాకర్‌రావు (ఫైల్)



కొప్పుల ఈశ్వర్



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పోలింగ్ కేంద్రాలు	269
మొత్తం ఓట్లు	2,24,591
పురుషులు	1,90,963
స్త్రీలు	1,14,622
ఇతరులు	6



నృసింహుడు కొలువైన ప్రాంతం..

శ్రీలక్ష్మీ నృసింహస్వామి వెలిసిన పుణ్యక్షేత్రమైన ధర్మపురి పేరిట ఏర్పాటైన ఈ నియోజకవర్గం.. పూర్తిగా వ్యవసాయ ఆధారితం. ఏడు మండలాల్లో కలిపి 129 గ్రామాలు.. మొత్తం 2,24,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,90,963 మంది, మహిళలు 1,14,622, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 63 శాతం బీసీలు, 23శాతం ఎస్సీలు, ఇతరులు 15 శాతం వరకు ఉన్నారు. పునర్విభజనకు ముందు గొల్లపల్లి మండలంలోని 8 గ్రామాలు జగిత్యాల నియోజకవర్గంలో, 17 గ్రామాలు చొప్పదండిలో, ధర్మపురి మండలం సిరికొండ గ్రామం చొప్పదండిలో.. మిగిలిన గ్రామాలు బుగ్గారం నియోజకవర్గంలో ఉండేవి. అలాగే పెగడపల్లిలోని నాలుగు గ్రామాలు జగిత్యాలలో, ఐదు గ్రామాలు, మేడారం, 17 గ్రామాలు చొప్పదండి పరిధిలో ఉండేవి. వెల్గటూర్‌లోని 19 గ్రామాలు మేడారంలో, ఐదు గ్రామాలు చొప్పదండిలో, రెండు గ్రామాలు బుగ్గారంలో ఉండేవి. ధర్మారం మండలం పూర్తిగా మేడారం నియోజకవర్గంలోనే ఉండేది.

తీర్పు విలక్షణం

- ధర్మపురి నియోజకవర్గానికి ముందు చొప్పదండి నియోజకవర్గం నుంచి 1957లో సీహెచ్.రాజేశ్వర్ రావు(పీడీఎఫ్) విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్ నుంచి బండారి రాములు, 1978లో న్యాలకొండ శ్రీపతిరావు (ఐఎన్‌సీ(ఐ)), 1983లో గుర్రం మాధవరెడ్డి (స్వతంత్ర) గెలిచారు. 1985, 1986, 1994 వరకు న్యాలకొండ రాంకిషన్‌రావు (టీడీపీ) వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించి మంత్రిగా కొనసాగారు. 1999లో కాంగ్రెస్ నుంచి కోడూరి సత్యనారాయణగౌడ్ విజయం సాధించారు. 2004లో టీడీపీ నుంచి సాన మారుతి విజయం సాధించారు. అనంతరం ఎస్సీ రిజర్వ్ అయినా 2009లో సుద్దాల దేవయ్య (టీడీపీ) నుంచి గెలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఉద్యమంలో పాలుపంచుకున్న 2014లో బొడిగె శోభ (టీఆర్ఎస్) నుంచి విజయం సాధించారు.
- ధర్మపురి నియోజకవర్గానికి ముందు బుగ్గారం (జనరల్) నియోజకవర్గంలోనూ కొన్ని మండలాలు ఉండేవి. అప్పటి ఓటరు తీర్పు సపరేట్ అన్నట్లు సాగింది. 1957 నుంచి 2004 వరకు అభ్యర్థి ఏ పార్టీకి చెందినా.. చివరకు స్వతంత్రంగా పోటీ చేసినా నియోజకవర్గ అభివృద్ధిని ఆశించినవారినే గెలిపించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో బద్దం ఎల్లారెడ్డి (స్వతంత్ర), 1962లో ఏనుగు నారాయణ రెడ్డి (స్వతంత్ర), 1972లో జోగిని దామోదర్‌రావు (స్వతంత్ర)కు పట్టంగట్టారు. 1978లో అంబల్ల రాజారాం(కాంగ్రెస్), 1983లో కడకుంట్ల గంగారాం (కాంగ్రెస్), 1985లో ఉప ఎన్నిక సమయంలో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టం కట్టారు. తిరిగి 1989లో జువ్వాడి రత్నాకర్‌రావు (స్వతంత్ర)ను గెలిపించారు. మళ్లీ 1994లో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టంగట్టారు. అనంతరం 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో జువ్వాడి (కాంగ్రెస్)ను గెలిపించారు.

2009 నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోట

2009లో ధర్మపురిగా ఆవిర్భవించినప్పటి నుంచి ఈ నియోజకవర్గప్రజలు ఒకే అభ్యర్థికి పట్టంగడుతూ వస్తున్నారు. 2009 నుంచి ఇప్పటివరకు 2009, (2010లో ఉప ఎన్నిక) 2014, 2018లో ఎన్నికలు జరగగా.. ఉద్యమ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తూ వస్తున్నారు. 2018లో గెలిచిన అనంతరం మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రతిసారీ ప్రధాన పోటీదారుగా కాంగ్రెస్ నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన) ఉన్నారు. ఈ సారి జరిగే ఎన్నికల్లోనూ ఇద్దరిమధ్యే పోటీ ఉండనుంది. తను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఐదోసారి కూడా గెలిపిస్తాయని మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధీమా వ్యక్తం చేస్తుండగా.. ఈ సారి అటు సానుభూతి, ఇటు ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ అంటున్నారు.

ఆపిల్ పండిస్తారట..!

- ఇటీవల కశ్మీర్ టూర్‌కు వెళ్లిన పీఏసీఎస్ చైర్మన్లు
- ఫలితం దక్కేనా.. పైసలు వృథానా..?

కోరుట్ల: చల్లటి సమశీతోష్ణ ప్రదేశాల్లో పండే ఆపిల్ పంటను ఎర్రటి ఎండల్లో పండిస్తారట. ఆపిల్ పంట సాగు పరిశీలన పేరిట ఎంచక్కా కాశ్మీర్ మొత్తం చుట్టేసి వచ్చారు మన పీఏసీఎస్ చైర్మన్లు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీఎంఎస్ (జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) ఆధ్వర్యంలో సాగిన ఈ యాత్రలో లక్షల రూపాయలు ఖర్చు అయినా వచ్చిన ఫలితం ఏమిటన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది.

వారం రోజుల టూర్..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం సుమారు 120 మంది పీఏసీఎస్ చైర్మన్లు ఉన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కశ్మీర్‌లో యాపిల్ సాగు, ఇతరత్రా పంటల సాగుపై అవగాహన పేరిట టూర్ నిర్వహించారు. ఈ టూర్‌కు సుమారు 60 మంది పీఏసీఎస్ చైర్మన్లు వెళ్లారు. ఒకట్రెండు రోజులు కశ్మీర్‌లో ఆపిల్‌తో పాటు ఇతర పంటల సాగుపై తూతూ మంత్రంగా పరిశీలన సాగించగా, మిగిలిన సమయం అంతా కశ్మీర్‌లో ఉన్న అందమైన ప్రదేశాలు చుట్టి రావడానికి సరిపోయింది. అయితే మన ప్రాంతంలో పండించేందుకు ఇసుమంత అవకాశం లేని ఆపిల్ పంటల పరిశీలన టూర్ పేరిట విహార యాత్ర జరిగిందా..? అన్న అంశం రైతు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఇటీవల కశ్మీర్ టూర్‌లో పీఏసీఎస్ చైర్మన్లు

అనువుకాదని తెలిసినా..

సాధారణంగా ఏడాది మొత్తం తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే ఎత్తైన ప్రదేశాలు ఆపిల్ పంట సాగుకు అనువుగా ఉంటుంది. ఈ విషయం సాధారణ రైతు నుంచి ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు. మన ప్రాంతంలోని వాతావరణం ఆపిల్ పంటకు అనువైంది కాదని అందరికీ తెలిసిన విషయమే. ఆపిల్ పంట సాగుకు పూత కాత సమయంలో 8–24 డిగ్రీల సెంటిగ్రేడ్ లోపు ఉష్ణోగ్రతలు, ఏడాది పొడుగునా 10 సెంటీమీటర్ల లోపు వర్షపాతం ఉండాలి. ఇటీవల కాలంలో ఆదిలాబాద్ జిల్లా తిర్యానీలోని కొండవాలు ప్రాంతాల్లో ఎత్తైన చల్లటి ప్రదేశాల్లో ఆపిల్ పంటను పెంచే ప్రయత్నం చేసినా పెద్దగా ఫలితం ఇవ్వలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడా ఇలాంటి వాతావరణ పరిస్థితులు లేవు. మరి పీఏసీఎస్ చైర్మన్లను ఆపిల్ పంటల సాగు పేరిట కశ్మీర్‌కు ఎందుకు తీసుకెళ్లారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వారం రోజుల పాటు సాగినా ఈ టూర్‌లో పంటల పరిశీలన కన్నా విహారయాత్ర ఎక్కువగా సాగిందని పీఏసీఎస్ చైర్మన్లు కొందరు నిర్మోహమాటంగా చెప్పడం గమనార్హం. మరి కొందరు మాత్రం ఇప్పటి వరకు ఏలాంటి టూర్లకు వెళ్లలేదు కాబట్టి కశ్మీర్ టూర్‌కు వెళ్లామని చెబుతున్నారు. మొత్తం మీద ఒక్కో పీఏసీఎస్ చైర్మన్‌పై కశ్మీర్ టూర్ పేరిట రూ. 40వేల వరకు ఖర్చు జరిగినట్లు తెలిసింది. ఈ లెక్కన 60 మంది విహారయాత్రకు ఎంత తక్కువ అనుకున్నా రూ.24లక్షల వరకు ఖర్చు వచ్చింది. ఖర్చు సంగతి సరే కానీ ఫలితం ఏమిటన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది.

ఆపిల్‌తోపాటు ఇతర పంటల పరిశీలనకే..

కశ్మీర్‌లో ఆపిల్‌తో పాటు ఇతర పంటల సాగుపై అవగాహన కోసం కశ్మీర్ విజ్ఞాన యాత్ర నిర్వహించాం. కశ్మీర్‌లో పండే వాణిజ్య పంటల సాగు మన ప్రాంతంలో వీలవుతుందా అన్న అంశాన్ని పీఏసీఎస్ చైర్మన్లు వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పరిశీలించారు.

– వెంకటేశ్వర్రావు, డీసీఎంఎస్ మేనేజర్

పోలీసులకు వ్యాసరచన పోటీలు

- విజేతలకు 31న బహుమతులు
- అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు

జగిత్యాలక్రైం:పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు సమక్షంలో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై అధికారి వరకు పనిజీవితం, సమతుల్యత అంశంపై, ఎస్సై స్థాయి ర్యాంక్ పోలీసు అధికారులకు సమాజంలో లింగ సమానత్వం అంశంపై పోటీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో పోలీసుల పాత్ర కీలకమని, అమరులైన పోలీసులను ఏటా స్మరించుకునేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 31న బహుమతులు ప్రదానం చేయడంతోపాటు, మొదటి ముగ్గురిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.



వ్యారసచన పోటీల్లో పాల్గొన్న పోలీసు అధికారులు

పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

- చెక్‌పోస్టులలో నిష్పక్షపాతంగా తనిఖీలు
- నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలు పక్కా ప్రణాళికతో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల ఎన్నికలు, పోలీస్, రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్నికల అధికారులు వివరించారు.

క్షేత్రస్థాయిలో సమీక్షించాలి

నియోజకవర్గాలవారీగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమీక్షించాలని ఆదేశించారు. సీవిజిల్ యాప్‌పై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. సువిధ మొబైల్ యాప్, యూజర్ చార్జీల గురించి తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తనిఖీల్లో నిష్పక్షపాతంగా ఉండాలి

చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా చేయాలని వికాస్‌రాజ్ ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది రాకుండా పట్టుబడిన నగదు, వస్తువులపై సమీక్షించుకొని చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పనితీరు సీసీకెమెరాలలో పర్యవేక్షించాలన్నారు. లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలన్నారు.

పోలింగ్‌శాతంపై దృష్టిపెట్టాలి

గతంలో పోలింగ్ శాతం తక్కువ నమోదైన ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితాలో డూప్లికేట్, డబుల్ ఓటర్లు లేకుండా చూడాలని, ఒకే ఇంటినంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగులు, 80 ఏళ్ల పైబడి పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని గోడౌన్లు, షాదీఖానాలు, ఫంక్షన్‌హాళ్లలో తనిఖీలు చేపట్టాలని, బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలని సూచించారు.

వీడియో రికార్డింగ్ చేయాలి

క్యూఆర్‌కోడ్, సరైన పత్రాలు లేకుండా బ్యాంకులు తరలించే నగదును సీజ్ చేయడంతోపాటు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వికాస్‌రాజ్ సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కాబోతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డు చేయించాలని సూచించారు. అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, డీఐజీ కె.రమేశ్ నాయుడు, ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు ప్రఫుల్ దేశాయ్, యాస్మిన్ బాషా, ముజమ్మిల్ ఖాన్, భీమ్యానాయక్, రామగుండం సీపీ రెమో రాజేశ్వరి, ఎస్పీలు అఖిల్‌మహాజన్, రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

క్లుప్తంగా

మల్లాపూర్ ఎస్సై, కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు


ఫిర్యాదు చేసిన బాధితుడు

జగిత్యాలక్రైం: అకారణంగా దాడికి పాల్పడిన మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, కానిస్టేబుల్ భూక్య సురేశ్‌పై చర్యలు తీసుకోవాలని బంజరి తండాకు చెందిన జాటోత్ కిషన్ శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. బానోతుతండాకు చెందిన జాటోతు కిషన్‌ను ఈనెల 26న రాత్రి 10.30 గంటల సమయంలో పోలీసులు మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచక్షణారహితంగా కొట్టడంతో తలకు గాయమైందని, రాత్రి ఆర్‌ఎంపీతో కుట్లు వేయించారని, అనంతరం పోలీసులే తీసుకెళ్లి ఇంటివద్ద వదిలిపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను విచక్షణారహితంగా కొట్టిన ఎస్సై, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సిరిపూర్‌లో కలప పట్టివేత


పట్టుబడిన కలపతో సురేష్‌రావు

మల్లాపూర్ : మండలంలోని సిరిపూర్ శివారులో నిల్వ ఉంచిన కలపను కోరుట్ల, మెట్‌పల్లి డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి సురేష్‌రావు ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది శనివారం దాడులు చేసి పట్టుకున్నారు. కలప అక్రమంగా రవాణా అవుతోందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి 37 కలప దుంగలను స్వాధీనం చేసుకున్నామని, కలప విలువ రూ.50వేల విలువ ఉంటుందని అటవీసిబ్బంది తెలిపారు. దాడుల్లో బీట్ అధికారి ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పట్టివేత


చీరలు, బట్టలను పరిశీలిస్తున్న ఎస్సై

సారంగాపూర్: అనుమతి లేకుండా ఓ ఆటోలో చీరలు, ఇతర దుస్తులు తరలిస్తుండగా పట్టుకుని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన వాసం ధర్మరాజు ఆటోలో చీరలు, ఇతర బట్టలు తీసుకెళ్తున్నాడు. వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ధ్రువీకరణ పత్రాలు చూపకపోవడంతో పట్టుకున్నామని, వాటి విలువ రూ.20,790 వరకు ఉంటుందని పేర్కొన్నారు.

‘స్త్రీనిధి’ రికవరీపై మహిళల ఆందోళన

- గతంలో రూ.4.50 లక్షలు సొంతానికి వాడుకున్న సీఏ
- విచారణ చేపడుతున్న అధికారులు


ఆందోళన చేస్తున్న మహిళలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లి గ్రామంలోని మహిళాసమైక్యలో గతంలో పనిచేసిన సీఏ రూ.4.50 లక్షలు సొంతానికి వాడుకున్న విషయం తెల్సిందే. వాటిని చెల్లించకపోవడంతో శనివారం మహిళా సంఘం సభ్యులు గ్రామంలో ఆందోళన చేపట్టారు. వారి కథనం ప్రకారం.. గతంలో వంజరిపల్లిలోని మహిళాసంఘాల పేరిట సభ్యులకు తెలియకుండానే సీఏ స్త్రీనిధి కింద రూ.4.50 రుణం తీసుకుంది. వాటిని నెలనెలా చెల్లించకపోవడంతో అధికారులు గ్రామానికి వెళ్లి మహిళలను సమావేశపరిచి ఆరా తీశారు. తాము ఎలాంటి రుణమూ తీసుకోలేదని, రుణంతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని తెలపగా.. అప్పటి అధికారులు సదరు రుణాలకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీలన్నీ పరిశీలించారు. సీఏనే సభ్యులకు తెలియకుండా రుణం పొంది సొంతానికి వాడుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. తాను ప్రతినెలా చెల్లిస్తానని సీఏ లిఖితపూర్వకంగా రాసి అధికారులకు ఇచ్చింది. ఈ క్రమంలో అధికారులు వీవో సంఘంలో ఉన్న డబ్బులను స్త్రీనిధి రుణాలు చెల్లించారు. తొమ్మిదేళ్లు గడుస్తున్నా సీఏ డబ్బులు చెల్లించడం లేదు. అప్పటినుంచి సంఘం సభ్యులు తమ లావాదేవీలను కూడా నిలిపివేశారు. గత రబీ సీజన్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వహణకు మహిళాసభ్యులు మళ్లీ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కూడా నిర్వహించారు. ప్రస్తుతం మళ్లీ కొనుగోళ్లు ప్రారంభంకానుండడంతో ఖర్చుల నిమిత్తం వీవోల నుంచి డబ్బులు తీయాలని సభ్యులు కోరగా.. మిగిలిన మహిళా సంఘాలు అడ్డుచెప్పాయి. గతంలో సీఏ సొంతానికి వాడుకున్న డబ్బుల రికవరీ చేయాల్సిందేనని మహిళాసంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. ఐకేపీ ఏపీఎం గంగాధర్ గ్రామానికి చేరుకుని గతంలో సీఏ వాడుకున్నట్లు నిర్ధారణ అయి పత్రాలతో విచారణ చేపట్టారు. మరోవైపు మహిళాసంఘ సభ్యులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కొత్త సీఏను నియమించుకునేందుకు తీర్మానం చేశారు. దీనికి కొందరు అడ్డుచెప్పడంతోపాటు గతంలో సీఏ వాడుకున్న డబ్బులు రికవరీ చేయాల్సిందేనని ఆందోళనకు దిగారు. స్వాహా చేసిన డబ్బులను పాత సీఏ నుంచి త్వరలోనే రికవరీ చేయిస్తామని అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- సంక్షేమ పథకం అందని ఇళ్లు లేదు
- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని, అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు చక్రపాణి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 300 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే మళ్లీ చీకటి రోజులేనన్నారు. మూడు గంటల కరెంట్ కావాలో.. మూడు పంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో నిర్ణయించుకోవాలని సూచించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన బీఆర్‌ఎస్‌ను ఆదరించాలనికోరారు.


మంత్రికి స్వాగతం పలుకుతున్న గొడిశెలపేట గ్రామస్తులు

అభివృద్ధికి పట్టంగట్టండి

ధర్మపురి: నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు పట్టంగట్టాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. మండలంలోని నర్సయ్యపల్లె, తుమ్మెనాల, బుద్దేశ్‌పల్లె గ్రామాల్లో ఆశీర్వాద యాత్ర చేపట్టారు.

మంత్రి హామీలన్నీ నీటిమూటలే..

- బీఆర్‌ఎస్ పాలనలో పెచ్చుమీరిన మిల్లర్ల దోపిడీ
- కాంగ్రెస్ అధికారంలోకొస్తే ఆరు గ్యారెంటీలు
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్


ప్రచారంలో మాట్లాడుతున్న లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్:ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలే అయ్యాయని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జగదేవుపేట, కొత్తపేట, పడకల్, కప్పారావుపేట, పైడిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గంలో ఎన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారో.. దళితులకు మూడెకరాలు ఎక్కడ పంచారో చెప్పాలని అన్నారు. జంగల్‌నాలా ప్రాజెక్టును ఎందుకు గాలికి వదిలేశారని ప్రశ్నించారు. రైతులు పండించిన ధ్యాన్యాన్ని మిల్లర్లు అడ్డగోలుగా దోచుకుంటుంటే మంత్రి చోద్యం చూశారని విమర్శించారు. కొప్పుల 20ఏళ్ల పాలనలో నియోజకవర్గానికి పాలిటెక్నిక్, ఐటీఐ, వంద పడకల ఆసుపత్రిగానీ ఏమీ తేలేకపోయారని తెలిపారు. కాళేశ్వరం లింక్–2 కింద ఈ ప్రాంత రైతులు రెండు వేల ఎకరాలు ఇస్తే అరకొర పరిహారం ఇచ్చి మంత్రి చేతులు దులుపుకున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్, మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు పూదరి రమేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళీగౌడ్, ఎంపీటీసీ మంజుల, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి



మాట్లాడుతున్న రమణ, చిత్రంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల:ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రమణ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బూత్, వార్డుస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలోనే జగిత్యాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగిత్యాల సీటును బహుమతిగా కేసీఆర్‌కు అందించాలన్నారు. అనంతరం కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, లైబ్రరీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

నియోజకవర్గాన్ని ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశామని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అన్నారు. జిల్లాకేంద్రంలోని 10వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే ధ్యేయం

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వినోద్, చల్మెడ

కథలాపూర్(వేములవాడ):రాష్ట్ర అభివృద్ధి.. సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మి నరసింహారావుతో కలిసి ప్రారంభించారు. ముందుగా తాండ్ర్యాల, అంబారిపేట, తుర్తి, పోసానిపేట, ఇప్పపల్లి, పోతారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ ఫలాలు సక్రమంగా అందాలంటే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మినరసింహరావు మాట్లాడుతూ.. అభివృద్ధి చేయాలనే ఆశయంతో ముందుకు వస్తున్నామని, నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

‘చల్మెడ’ ప్రచారంలో యువకుల నిరసన

తాండ్ర్యాలలో చల్మెడ లక్ష్మినరసింహారావు ప్రచారానికి రాగా.. యువకులు నల్ల కండువాలతో నిరసన తెలిపారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు లేవని, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించలేదని నినాదాలు చేశారు.

పేదలను దగా చేసిన బీఆర్‌ఎస్

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్

కథలాపూర్: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పదేళ్లలో పేదలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం దగా చేసిందని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. శనివారం కథలాపూర్ మండలం చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఇళ్లులేని పేదలకు డబుల్ బెడ్రూం మంజూరు చేస్తామని చెప్పి ఐదేళ్లలో ఎన్ని నిర్మించారో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రత్యేకంగా నిధులు ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో స్పందన ఉందని, ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.అజీమ్, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, సర్పంచ్ కూన సులోచన, ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, తలారి మోహన్, గడ్డం చిన్నారెడ్డి, పుర్కుటపు తిరుపతిరెడ్డి, కట్ట శంకర్, అంగరి శ్రీకాంత్, వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల బీఆర్‌ఎస్సా.. మూడు గంటల కాంగ్రెస్సా..

- బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను నమ్మితే గోసపడుతాం
- సంజయ్‌ను అశీర్వదించండి: ఎమ్మెల్యే కల్వకుంట్ల


ముత్యంపేటలో నినాదాలు చేస్తున్న సంజయ్, విద్యాసాగర్‌రావు

మల్లాపూర్:24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా.. మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని ముత్యంపేట, హుస్సేన్‌నగర్, రాఘవపూట, నడికుడ, మొగిలిపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్‌తో కలిసి ప్రచారం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పరిస్థితి, నేటి అభివృద్ధి, సంక్షేమాన్ని పరిశీలించాకే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నా.. లేకున్నా ప్రజలతోనే ఉంటానన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత మాటలను నమ్మవద్దని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో సంజయ్‌కుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు. మల్లాపూర్‌లో మండల బూత్‌స్థాయి సమావేశంలో సంజయ్ మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి, ఎంపీ అరవింద్, కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగరావు రూపాయి అభివృద్ధి చేయకుండా అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, ఓట్లతోనే వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, బద్దం అంజిరెడ్డి, నేరేళ్ల మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ అమ్మకాలపై ఉక్కుపాదం

– జగిత్యాల ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి


పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి

జగిత్యాలక్రైం:మద్యం అక్రమంగా విక్రయిస్తే ఉక్కుపాదం మోపుతామని జగిత్యాల ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం రాయికల్ మండలం మూటపల్లి, కొత్తపేట గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 29.9 లీటర్ల బీర్లు, 5.58 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.13,614 ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఎస్సైలు మేఘమాల, సరిత, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగిని కొట్టిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం:జిల్లాకేంద్రంలోని 17వ వార్డులో ఇంటిని పరిశీలించేందుకు వెళ్లిన టౌన్‌ప్లానింగ్ చైన్‌మెన్ బిరుదుల అశోక్‌ను దుర్భషలాడుతూ..దాడి చేసిన రాజసుమన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మోహన్ తెలిపారు.

దాడి ఘటనలో పలువురిపై..

జిల్లాకేంద్రంలోని అంగడిబజార్‌లో కర్రీపాయింట్ నిర్వహిస్తున్న శేర్ విజయ్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై చంద్రయ్య తెలిపారు. రాంబజార్‌కు చెందిన విజయ్ కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 25న రాత్రి వంశీ, శ్రీకాంత్, కుసుంబ నిఖిల్, దీక్షిత్‌రావు, మరికొంత మంది మద్యం తాగి విజయ్‌తో గొడవపడ్డారు. ఇనుపరాడ్‌తో దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వంశీ, శ్రీకాంత్, కుసుంబ నిఖిల్, దీక్షిత్‌రావుతో పాటు, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత


పట్టుబడిన నగదుతో పోలీసులు

మెట్‌పల్లిరూరల్: ఎలాంటి పత్రాలూ లేకుండా కారులో తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. శనివారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి కారులో రూ.లక్ష నగదు ఉన్నట్లు గుర్తించామని, ఇందుకు సంబంధించిన ఆధారాలేమీ చూపలేదన్నారు. దీంతో ఆ పట్టుబడిన నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

సారంగాపూర్:బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇందిరానగర్ ప్రాంతంలో రాత్రిపూట పోలీసుల పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో విధులకు ఆటంకం కలిగించిన కేసులో శనివారం ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతం పవార్ తెలిపారు.

దళితబంధు ఎంతమందికి ఇచ్చారు..?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


పెంబట్లలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్:మూడేళ్లలో జగిత్యాల నియోజకవర్గంలో ఎంతమందికి దళితబంధు అందించారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెంబట్ల, గణేశ్‌పల్లి, బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలతో సమావేశమయ్యారు. దళితబంధు పథకాన్ని అర్హులందరికీ అందించాలని, నాలుగేళ్లలో ఎంతమందికి అందించారో చెప్పాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున తరుగు పేరిట దోపిడీ చేశారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. పెంబట్ల సమావేశంలో దళిత సంఘాల నాయకులు తోట మల్లయ్య, రమేశ్, మిట్ట అనిల్, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముద్దం చిరంజీవి, కొండ్ర రాంచంద్రారెడ్డి, కోసవేని రాజేందర్, బాదినేని లక్ష్మీనారయణ, మల్యాల శ్రీనివాస్, తుంగూర్ సమావేశంలో ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు తదితరులు ఉన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

– బీజేపీ జగిత్యాల అభ్యర్థి శ్రావణి


మాట్లాడుతున్న శ్రావణి

సారంగాపూర్: బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అభ్యర్థి భోగ శ్రావణి అన్నారు. శనివారం మండలంలోని అర్పపల్లి, ధర్మనాయక్‌తండా, పెంబట్లకు చెందిన పలువురు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. బీసీ మహిళ అయిన తనకు పార్టీ అవకాశం ఇచ్చిందని, ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడించారు. బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా మండల కన్వీనర్ దూలురి వంశీ, సుమారు 150 మంది పార్టీలో చేరారు. పార్టీ నాయకులు ఎంబడబెట్ల వరుణ్‌కుమార్, వీరబత్తిని అనిల్‌కుమార్, బద్దెల గంగరాజం, బొమ్మకంటి ప్రమోద్, దీటి వెంకటేశ్, గొల్లపల్లి తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకొస్తే బీసీ సీఎం


మాట్లాడుతున్న ఎస్.కుమార్

ధర్మపురి: ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకొస్తే బీసీనే సీఎం అయ్యే అవకాశముందని పార్టీ నియోజకవర్గ అభ్యర్థి ఎస్.కుమార్ తెలిపారు. ముందుగా ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామిని దర్శించుకున్నారు. కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం లభిస్తుందన్నారు. కొందరు బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు కేంద్రం నిధులతోనే సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.